www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 21 డిసెంబర్ 2025 | 5 | కాకినాడ



అసైన్డ్ లబ్ధిదారులకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండంలోని శాంతిమూల, పటవల గ్రామాల్లోని సుమారు 50 మంది అసైన్డ్ భూమి లబ్ధిదారులకు పట్టాలు, పాసు పుస్తకాలు ఇవ్వాలని సిపిఎం మండల కన్వీనర్ ఈశ్వరరావు, లబ్ధిదారులు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజులను శనివారం కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి సంబంధిత అంశాన్ని పరిశీలించాలని ఆర్‌డిఒను ఆదేశించారని, అలాగే ఎంఎల్ఎ సైతం సాగు చేసుకుంటున్న వారికే పట్టాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని ఈశ్వరరావు స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దుప్పి అదృష్టదీపుడు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఈశ్వరరావు

పాడి రైతుకు ఎంత కష్టం..!

-సౌకర్యాల లేమితో పశువైద్య ఆసుపత్రులు
-ఏడాదిగా అందుబాటులో లేని మందులు
-పశు పోషకులపై ఆర్థిక భారం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం చేసుకునే రైతులు పాడి పరిశ్రమను అనుబంధంగా నడిపేవారు. ఒకప్పుడు వ్యవసాయ భూమి కలిగిన ప్రతీ ఒక్కరికీ పాడి పరిశ్రమ ఉండేది. ప్రస్తుతం క్రమంగా పశుపోషకులు తగ్గిపోతున్నారు. ఇందుకు కారణం ప్రభుత్వం నుంచి పశు సంవర్ధక శాఖ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదు. దీనిలోభాగంగానే పశువైద్య ఆసుపత్రులకు గత కొన్ని నెలలుగా మందులను ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. నిధుల కొరత వలన ఆసుపత్రులకు పూర్తి స్థాయిలో మందులను అందివ్వకపోవడంతో పాడి రైతులపై అదనపు భారం పడుతోంది.

జిల్లాలో 76,502 ఆవులు, 2,82,274 గేదెలు, 1,01,870 గొర్రెలు, 1,41,229 మేకలు ఉన్నాయి. 92,48,636 కోళ్లు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,22,550 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి జరిగింది. 62,481 మెట్రిక్ టన్నుల మాంసం ఉత్పత్తి, 30,553 లక్షల గుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో పాడి పశువులకు అనేక వ్యాధులు సక్రమిస్తున్నాఇయ. సకాలంలో వైద్యం చేయించుకోవాలంటే దగ్గరలో ఉన్న పశుఆసుపత్రలకు వెళ్లాల్సి వస్తుంది.

10 నెలలుగా మందులు లేవు

ప్రస్తుతం అన్ని రకాల పశువులకు నట్టల నివారణకు మందుల అవసరం ఉంటుంది. గర్భకోశ వ్యాధులకు, పోషకాలు మందులు, ఇతర సీజనల్ రోగాలకు మందులు నిత్యం అవసరం ఉంటుంది. ప్రతీ మండల కేంద్రంలో ఒక ఆసుపత్రి, రెండు మండలాలకు ఒకటి చొప్పున ఏరియా ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయి. ఒక్క ఆసుపత్రికి రూ.45 వేల నుంచి రూ.1.20 లక్షల వరకూ విలువైన మందులను ప్రతీ మూడు నెలలకోకసారి అవసరం ఉంటాయి. అయితే గత 10 నెలలుగా ఈ మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండటం లేదు. దీంతో పశువులకు ఏదైనా వ్యాధి సోకి ఆసుపత్రులకు వెళుతుంటే అక్కడి వైద్యులు మందులు లేవని బదులిస్తున్నారు. దీంతో చేసేదిలేక పాడి రైతులు ప్రయివేటు దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాల్సివస్తుంది. నెలకు ఒక్కో పశువుపై మందుల కోసం రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మందులను సరఫరా చేయకపోవడంతో అదనపు భారం తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. మరోవైపు అరకొరగానే సంచార పశు వైద్య సేవలు అందుతున్నాయి. రైతు సేవా కేంద్రాల్లో సైతం మందులు అందుబాటులో లేక అవస్థలు తప్పడం లేదు. ప్రయివేటులో కొనుగోలు చేయలేక అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.89 లక్షల విలువైన మందులకు ఇండెంట్

ప్రస్తుతం ఈ సీజన్లో జీర్ణ సంబంధిత నొప్పులు, గర్భ సంబంధ సమస్యలు అనేక పశువుల్లో కనిపిస్తున్నాయి. అజీర్తి, ఆమ్ల, జలగ వ్యాధులు, బికోలై ఇన్ఫెక్షన్, ఫెర్టిలిటీ, బ్యాక్టీరియా, వైరల్ సమస్యలతో పశువులు బాధపడుతున్నాయి. అయితే ప్రభుత్వం ఆయా ఆసుపత్రులకు ప్రతి మూడు నెలలకోసారి మందులు సరఫరా చేయాల్సివుంది. కానీ 10 నెలలుగా మందులు రావడం లేదని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో వివిధ ఆసుపత్రులకు సంబంధించి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు సుమారు రూ.89 లక్షల విలువైన వివిధ రకాల మందులకు ఇటీవల ఇండెంట్ పెట్టారు. వీటిలో యాంటీబయాటిక్స్, యాంటీ పైరెటిక్, యాంటీ ఇన్ఫమేటరీ ద్రవాలు, కాలేయ టానిక్స్, ఖనిజ మిశ్రమం మందులు, నురుగు నివారణకు, ప్రాణాలను రక్షించే మందులు ఇలా అవసరమైన మందుల కోసం ఇండెంట్ పెట్టారు. ఈ నెల చివరికల్లా మందులు అందుబాటులో ఉంటాయని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వివిధ ప్రజాసంఘాల నాయకులు

జి రామ్‌జీ బిల్లు దుర్మార్గం

-తక్షణమే రద్దు చేయాలని ప్రజాసంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో జవసత్వాలు లేని జి రాం జీ బిల్లును తీసుకురావడం దుర్మార్గమని ప్రజాసంఘాల నేతలు మండిపడ్డారు. తక్షణమే సంబంధిత బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలు రైతుల సంఘం, ఎపి రైతు సంఘం, సిఐటియు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 2005లో అప్పటి యుపిఎ ప్రభుత్వం వామపక్షాల కృషి ఫలితంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఆ చట్టం పేదరిక నిర్మూలన, గ్రామాలు, వ్యవసాయ అభివృద్ధికి ఎంతో దోహదపడిందన్నారు. కానీ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఆ చట్టానికి తూట్లు పొడుస్తూ నిర్వీర్యం చేస్తూ వచ్చిందని విమర్శంచారు. నేడు ఆ చట్టానికి ఉన్న మహాత్మగాంధీ పేరును తొలగించి చట్టంలో ఉన్న కీలక అంశాలను మార్చివేసిందనన్నారు. ఈ కొత్త చట్టం అమలులోకి వస్తే ఇక ఆంధ్రప్రదేశ్లో ఉపాధి పనులు జరగడం అసాధ్యమని అన్నారు. దీనికి కారణం ఇప్పటి వరకు ఈ పథకంలో కేంద్రం 90 శాతం నిధులు ఇచ్చేదని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 10 శాతం మాత్రమే సమకూర్చేదని అన్నారు. కానీ కొత్త చట్టంలో 60 శాతం నిధులు మాత్రమే కేంద్రం భరించి మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్రాల భరించాలనే బిల్లును నేడు ఆమోదించిందన్నారు. ఇప్పటికే ఆంధ్ర రాష్ట్రం అనేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నదని, 40 శాతం నిధులు సమకూర్చే పరిస్థితిలో లేదని అన్నారు. కావున తక్షణమే ఈ నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇంత ద్రోహం చేసే ఈ కొత్త చట్టాన్ని మన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు సపోర్ట్ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. పాత చట్టాన్ని పునరుద్ధరించి, దాన్ని మరింత బలోపేతం చేయాలని, ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో నిధులు పెంచి వేతనదారులకు సంవత్సరంలో 200 రోజులు పనులు, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు నెరవేరేవరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని, ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్రాల అప్పారెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజ్‌కుమార్, వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.సింహాచలం, అదృష్టదీపుడు, భూలోకం, కృష్ణ, నారాయణరెడ్డి, త్రిమూర్తులు పలివెల వీరబాబు, మలకా రమణ, ఎంవి.రమణ, టి.రాజా, సత్తిరాజు, కృష్ణాజీ, పి.రామకృష్ణ, జిత్తుగ శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిఆర్ఒ జె.వెంకటరావుకు వినతిపత్రం అందజేశారు.

సిఆర్‌ఎంటిల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

సమగ్ర శిక్షలో పనిచేసే సిఆర్‌ఎంటిల సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ చంటిబాబు, సెక్రటరీ నాగమణి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిఆర్‌ఎంటిలను స్థానికత ఆధారంగా ఉద్యోగంలోనికి తీసుకుని, ఇప్పుడు కొత్తగా బి.క్లస్టర్ పేరుతో క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్ల పరిధిని పెంచి, మిగిలిన వారిని ఇతర జిల్లాలకు బదిలీలు చేయడం మానుకోవాలని అన్నారు. గత ఆరేళ్లగా వేతనాలు పెంచకపోయినా సర్దుబాటు చేసుకుని ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచుతున్న సిఆర్‌ఎంటిలను బదిలీల పేరుతో వేధించడం మానుకోవాలన్నారు. తక్షణం సమగ్ర శిక్షలో పనిచేసే అన్ని డిపార్ట్మెంట్ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ లేదా మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక చుట్టుపక్కల రాష్ట్రాలలో కేంద్రం ఇచ్చిన 60 శాతం నిధులకు అదనంగా, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లో 40 శాతం నిధులు కేటాయించి పాఠశాల విద్యను ముందుకు తీసుకువెళ్తుంటే, ఆంధ్రప్రదేశ్ బడ్జెట్లో మాత్రం ఒక్క రూపాయి కేటాయించకపోవడం అన్యాయమన్నారు. తక్షణం రాష్ట్ర వాటా 40 శాతం నిధులు కేటాయించి పిఆర్‌సి ప్రకారం సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు చెల్లించకపోతే పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. బి.క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని, ఎంటిఎస్ అమలు చేయాలని కోరుతూ ఈ నెల 22న తలపెట్టిన చలో విజయవాడకు తమ సంపూర్ణ మద్దతును తెలిపారు.



సిఎంఆర్‌టిలకు మద్దతు తెలుపుతున్న జెఎసి సభ్యులు

పల్స్ పోలియోపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ

ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె నరసింహనాయక్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ నరసింహ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఆదివారం ఉదయం స్థానిక రామారావుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్ ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1332 బూత్‌లు, 56 ట్రాన్సిట్ పాయింట్‌లు, 61 మొబైల్ బృందాల ద్వారా జిల్లాలో 1,94,437 పిల్లలకు పోలియో వాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. 130 రూట్ సుపర్‌వైజర్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఎఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇప్పటికే అన్ని గృహాలకు సమాచారం అందించారని, పిల్లలను బూత్ లకు సమీకరించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌టిఒ డాక్టర్ చలమయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కెవి. సుబ్బరాజు, డిఎంఒ ఐసి డాక్టర్ ఐ.ప్రభాకర్, ఎన్‌సిడి ఆర్‌బిఎస్‌కె డాక్టర్ వి.అరుణ, ఫైలేరియా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రవి, స్టాటిస్టికల్ ఆఫీసర్ శ్రీనివాసారావు, డిపిహెచ్ఎన్ఒ టి.నీలవేణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భవ్య హెల్త్ కేర్ యాజమాన్యంపై చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

భవ్య హెల్త్ కేర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం వద్ద జిల్లా ఉద్యోగులు నిరసన చేపట్టారు. అనంతరం డిఎంహెచ్ఒ నరసింహనాయక్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 ఉద్యోగుల సమస్యలను అధికారులకు తెలియజేసినందుకు సస్పెన్షన్ లెటర్ ఇచ్చిన 104 రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని వెంటనే సస్పెన్షన్ రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలన్నారు. 104 ఉద్యోగులకు భవ్య యాజమాన్యం తగ్గించిన జీతాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. 104 ఉద్యోగులకు గతంలో ఇచ్చిన విధంగానే సంవత్సరానికి 15 క్యాజువల్ లీవ్స్ ఇవ్వాలన్నారు. పూర్తిస్థాయిలో 104 వాహనాలలో బఫర్ ఉద్యోగులను తీసుకోవాలన్నారు. భవ్య యాజమాన్యం 7 నెలలు పూర్తయిన కానీ ఇప్పటివరకు ప్లే స్లిప్పులు, నియామక పత్రాలు, ఐడి కార్డులు పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 104 సంజీవినిగా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తుందన్నారు. గత అరబిందో యాజమాన్యం పెట్టిన బకాయిలను పూర్తిస్థాయిలో ఇప్పించి ఉద్యోగులు అందరికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందన్నారు. 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 104 ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి త్రిమూర్తులు, కోశాధికారి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వెంకట్రావు, డివిజన్ లీడర్లు హరిప్రసాద్, స్వర్ణ తేజ, వివేక్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.




సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగుల నిరసన

శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేధింపులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పారిశుధ్య కార్మికులు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పకు ఫిర్యాదు చేశారు. శనివారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద పారిశుధ్య కార్మికులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తమను విధుల సమయంలో తీవ్ర దుర్భషలాడటమే కాకుండా తాము పని చేసే ప్రదేశాలను మాటిమాటికీ ఇష్టానుసారం మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యను పిలిపించి మాట్లాడారు. శానిటేషన్ కార్మికులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆమెను ఆదేశించారు.



ఎంఎల్ఎకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పవన్ కల్యాణ్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నిడదవోలు నియోజకవర్గం పెరవలికి వచ్చిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌ను ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె స్థానిక విలేకరులకు వెల్లడించారు.



డిసిఎంతో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పోలీసు స్టేషన్‌ను డిఎస్‌పి శ్రీహరిరాజు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణలో మరింత క్రమశిక్షణ, పారదర్శకత పాటించాలన్నారు. పోలీస్ స్టేషన్ శుభ్రత, రికార్డుల నిర్వహణ, సాంకేతిక వనరుల వినియోగం, ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలలో ఎలాంటి అల్లర్లు గొడవలు జరగకుండా శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సైబర్ క్రైమ్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్ఐ రఘునాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీహరిరాజు

బాక్సింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9వ ఎలైట్ ఉమెన్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జనసేన నాయకులు సురవరపు సురేష్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్, కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు, ఎపి బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు, సెక్రెటరీ పి.మధుసూదన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలిసారిగా రాష్ట్ర స్థాయి మహిళ బాక్సింగ్ పోటీలు పిఠాపురంలో నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు వచ్చారన్నారు. వారికి రెండు రోజులపాటు వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభను చాటుకున్న క్రీడాకారులు జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.పద్మనాభం, కె.చిన్నబ్బాయి, జె ప్రసాదరావు, లోవరాజు, రంగబాబు పాల్గొన్నారు.



బాక్సింగ్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

సైన్స్ ఫెయిర్‌లో గురజనాల్లికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - కరప


జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గురజనాపల్లి జడ్‌పి హైస్కూల్ టీచర్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిందని పాఠశాల హెచ్‌ఎం సాయిమోహన్ తెలిపారు. స్కూల్ ఉపాధ్యాయులు వివి.రమణమూర్తి తయారు చేసిన తరువాత తరం స్మార్ట్ స్కూల్ ఎకో సిస్టం ప్రాజెక్ట్ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా వివి.రమణమూర్తిని ఉపాధ్యాయులు అభినందించారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక అచ్చంపేటలోని తన నివాసంలో మండలంలోని పనసపాడు గ్రామానికి చెందిన పాలిక జస్మితకు సిఎంఆర్‌ఎఫ్ నుంచి విడుదలైన రూ.51,300 చెక్కును ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్, టిడిపి నాయకులు అనుసూరి రాంబాబు, అమలాపురపు దుర్గాప్రసాద్, వెలుగు ఏసుబాబు, వనుం శివ, అనుసూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆదాయ వనరుల పెంపుదలకు కృషి

ప్రజాశక్తి - యంత్రాంగం

యు.కొత్తపల్లి స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ సొంత ఆదాయ వనరులు పెంపుదలకు కృషి చేయాలన్నారు. పంచాయతీలలో ఆదాయ వరునులను గుర్తించాలన్నారు. సాంకేతిక వ్యూహాల వంటి వాటిపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ గోవిందరాజులు, ఎఒ చలమయ్య, తదితరులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదాయ వనరులపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సెలెట్ రాజు, తహశీల్దార్ రామ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వి.సాగర్‌కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్.వెంకటేశ్వరరావు, కార్యదర్శులు, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **గండేపల్లి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పోతుల శిరీషతరంగిణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కర్రి హరికృష్ణసత్యారెడ్డి, ఎఒ చంద్రరావు, డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణా కార్యక్రమం ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్‌రెడ్డి, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి వై.శ్రీహరి, కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



యు.కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎంపిడిఒ లక్ష్మీరెడ్డి



అవగాహన కల్పిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

తూనికలు, కొలతలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక టిటిడి కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న రైతు బజార్లో వినియోగదారులకు తూనికలు, కొలతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ప్రారంభానికి ముందు రైతు బజారులో తూనికలు, కొలతలు పరిశీలించారు. ఈ సదస్సులో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ మాట్లాడుతూ తూనికలు కొలతలు విషయంలో యజమానులు విధి విధానాలు పాటించాలన్నారు. తూనికలలో మోసం జరిగితే కేసు నమోదు చేస్తామన్నారు. డిసిపిసి సభ్యుడు, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ రైతు బజార్లో నాణ్యమైన కూరగాయలు అమ్మాలన్నారు. తూనికల్లో తేడాలు జరగరాదన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘ కార్యదర్శి ఎం.భాస్కరరావు, సభ్యులు కె.సుధాకర్, సిహెచ్‌వి.చౌదరి, టి.సత్యనారాయణ, వి.శ్యామల, కెవిపి. లక్ష్మి, రైతు బజార్ కార్యదర్శి శ్రీనివాస్, వినియోగదారులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ పథకాలు అందేలా చర్యలు


ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రతి కుటుంబానికి నూరు శాతం సంక్షేమ పథకాలు అందింలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపిడిఒ విజెవి.రమణ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ లక్ష్మణరావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్ళి కుటుంబ సర్వే చేయాలన్నారు.

విశ్రాంత ఉద్యోగ సంఘ నేత మృతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు(98) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన 35 సంవత్సరాలపైగా ప్రభుత్వ ఉపాధ్యాయునిగా సేవలందించడమే కాకుండా వందలాది మంది విద్యార్థులకు నవోదయ, భూపతిపాలెం, కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలకు శిక్షణనిచ్చి వేలాది మంది బావిభారత పౌరులను తీర్చిదిద్దారు. ఆయన మృతి పట్ల యుటిఎఫ్ మాజీ అధ్యక్షులు ఎండి ఇబ్రహీం ఖాన్, ఎబివి.ప్రసాద్, జాన్‌విల్సన్‌బాబు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వుడతా రామచంద్రావు, వాసా పుల్లయ్య, మజ్జి తాతారావు, జోగిరాజు పలువురు రాజకీయ వ్యాపార ప్రముఖులు, పూర్వపు విద్యార్థులు సంతాపం తెలిపారు.



నేరాలు ఘోరాలు

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ

గత మూడేళ్లుగా కాజులూరు, తాళ్లరేవు, కరప మండలాల్లో మహిళలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చైన్ స్నాచింగ్ ముఠా ఆగడాలకు పోలీసులు చెక్ పెట్టారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు, ఏకంగా 29 నేరాలతో సంబంధం ఉన్న నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.58 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పి బిందుమాధవ్ వివరాలను వెల్లడించారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. డిసెంబర్ 19వ తేదీన కోలంక గ్రామ శివారు గోపిపేట వంతెన వద్ద నిఘా పెట్టడం జరిగిందన్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముల్లాడి విజయ్‌కుమార్, పెసింగి రాధాకృష్ణ, ముల్లాడి సతీష్, పారంశెట్టి బుజ్జి వెంకట దుర్గారావును అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఈ ముఠా ఒంటరిగా వెళ్లే మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని మంగళ సూత్రాలను, బంగారు గొలుసులను బైకులపై వేగంగా వచ్చి లాక్కెళ్లేవారన్నారు. అరెస్టయిన వారిలో విజయ్ కుమార్, రాధాకృష్ణలపై అత్యధికంగా 22 నుంచి 25 కేసులు ఉన్నాయని అన్నారు. కాకినాడ జిల్లాతో పాటు కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోనూ ఈ ముఠా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిందని తెలిపారు. ఈ ముఠా నుంచి రూ.56 లక్షల విలువ చేసే 452 గ్రాములు బంగారం, రూ.2 లక్షలు విలువచేసే ఐదు మోటర్ సైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభను కనబరిచిన రూరల్ సిఐ చైతన్య కృష్ణ, ఎస్ఐ మోహన్‌కుమార్, హెచ్‌సి నరసింగరావు, కానిస్టేబుల్ గోవిందరాజులు, ఐటీ కోర్ సిబ్బందిని ఎస్పి అభినందించారు. క్షేత్రస్థాయిలో ప్రాణాలకు తెగించి దొంగలను వేటాడిన సిబ్బందికి రివార్డులను ప్రకటించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

చర్చికి పెయింటింగ్ వేస్తూ ఒక వ్యక్తి కాలుజారి తీవ్ర గాయాలపాలయ్యాడు. కాకినాడ జగన్నాథపురంకు చెందిన పలివెల సతీష్ ఉప్పాడలోని ఒక చర్చికి పెయింటింగ్‌ను రెండు రోజులుగా వేస్తున్నాడు. శనివారం ఉదయం యథావిధిగా చర్చి గోడలకు పెయింటింగ్ వేస్తుండగా కాలుజారి కింద పడిపోయాడు. దీంతో హుటాహుటీన అతనిని స్థానిక పిహెచ్‌సికి తరలించారు. సతీష్ కాలు విరిగిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రాథమిక వైద్యం అనంతరం క్షతగాత్రుడిని కాకినాడకు తరలించారు.

బైకు దొంగకు జైలు శిక్ష

ప్రజాశక్తి - సామర్లకోట

బైక్ చోరీ నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ కాకినాడ 5వ జెఎఫ్‌సిఎం కోర్టు జడ్జి ఎస్‌కె షారోని తీర్పు వెలువరించినట్లు సిఐ కృష్ణభగవాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మాధపట్నం, వేట్లపాలెం గ్రామానికి చెందిన పిల్లి విజయ్‌కుమార్, వీర వెంకట సత్యనారాయణకు చెందిన బైక్‌లు చోరీ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ కేసులో నిందితుడైన ఖమ్మం జిల్లా అర్వారావుపేటకు చెందిన సారిపల్లి నరసయ్యారాజుకు ఒక నెల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు సిఐ తెలిపారు.



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ముదునూరి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని గజ్జనంపూడి గ్రామానికి చెందిన చంద్రాడ ఆశీర్వాదం ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే ఆ కుటుంబాన్ని శనివారం ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొండి రాంబాబు, మొల్లి వీరబాబు, అనకాపల్లి నూకరాజు, చంద్రాడ రాజు, చంద్రాడ అర్జునుడు పాల్గొన్నారు.

22న యథాతథంగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ నెల 22వ తేదీన పాడా కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యాక్రమాన్ని యథాతథంగా నిర్వహించనున్నట్లు పాడా పీడీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

పని ఒత్తిడి తగ్గించాలి

ప్రజాశక్తి -గోకవరం

పని ఒత్తిడి నుంచి వెసులుబాటు కల్పించాలని విఆర్ఒలు స్థానిక డిప్యూటీ తహశీల్దారుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో తమ విధుల కారణంగా పని ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేల్లో తమకు మినహాయింపు ఇవ్వాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ ఆధార్ ఆప్షన్‌తో వేసుకోవడానికి వెసులుబాటు కల్పించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - అమలాపురం

విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్‌కెబిఆర్ కళాశాలలో ప్రిన్సిపల్ సుబ్బారావు అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎస్‌పి ప్రసాద్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణ సీఐ వీరబాబు మాట్లాడుతూ అరచేతిలో ఇముడుతున్న సెల్ ఫోన్ వినియోగంలో మంచిని స్వీకరించి చెడుకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఓ వెంకట పతి రాజు, మెండు బాలాజీ విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి మాట.. హామీల పాట..



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పర్యటనలు ఆద్యంతం జిల్లా ప్రజలను ఉసూరుమనిపించాయి. ఎప్పటిలానే అభివృద్ధి మాట.. హామీల పాటలతో పర్యటనలు మమ అనిపించారు. మంత్రి నారా లోకేష్ పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు విద్యార్థులతోనూ ముఖాముఖి అయ్యారు. క్రమంతప్పక ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తోంది. మరోవైపు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ ఇచ్చిన హామీ నీటిమీద రాతలుగా మిగిలిపోయింది. కేవలం ఒకటి లేక రెండు నోటిఫికేషన్‌లు మినహా గడిచిన 18 నెలల్లో నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదు. ఇంకోవైపు నిరుద్యోగ భృతి హామీ నేటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ఇటువంటి కీలకమైన సమస్యలను పరిష్కరించకపోగా విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలంటూ హితవు పలికారు. ఉద్యోగాల కల్పనకు అకడమిక్స్‌తో పాటు ఇండస్ట్రీని అనుసంధానిస్తామని, కేజీ నుంచి పీజీ వరకు స్త్రీలకు ప్రత్యేక కార్యచరణ, జనవరిలో జాబ్ క్యాలెండర్ అంటూ హామీలను గుప్పించటం చర్చనీయాంశమైంది. గత నెలలో నిర్వహించాల్సిన ఈ పర్యటన టిడిపిలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో పలుమార్లు వాయిదా పడింది. సిటీ ఎంఎల్ఎతో పాటు పలువురు ముఖ్యనేతలు మధ్యం సిండికేట్‌లకు వెన్నుదన్నులా ఉన్నారనే ఆరోపణలు గత నెలరోజులుగా భగ్గుమంటున్నాయి. దీంతో పాటు రాజానగరంలో టిడిపి, జనసేన నేతల మధ్య ఆరంభం నుంచి లుక లుకలు వెంటాడుతూనే ఉన్నాయి. పలుమార్లు ముఖ్యనేతలు వారించినా ఫలితం లేకపోయింది. తాజాగా లోకేష్ పర్యటన కూడా ఈ ఆధిపత్య పోరుకు వేదికైంది. ఆదికవి నన్నయ్య యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో తమకు కనీస ప్రాధాన్యత ఇవ్వలేదంటూ జనసేన ఎంఎల్ఏ బత్తుల బలరామకృష్ణ ఆయన అనుచరులు చేసిన వీరంగం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదే విధంగా అమరజీవి జలధార పేరుతో పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ పథకానికి ప్రారంభోత్సవం చేపట్టారు. రెండేళ్లలో ఈ కార్యక్రమం పూర్తి చేయాలని, నాణ్యత లోపిస్తే సహించబోమని అధికారులను ఆదేశించారు. ఇటువంటి ప్రకటన హర్షించదగినదే. అయితే పిఠాపురం నియోజకవర్గంలో గత కొంతకాలంగా నెలకొన్న అనిశ్చితిపై కనీసం స్పందించకపోవటం విస్మయానికి గురి చేస్తోంది. పిఠాపురం నియోజక వర్గం, కొత్తపేటలో ఒక క్రైస్తవ మందిరాన్ని, ఆర్ఎస్ఎస్ ఇతర అనుబంధ సంస్థలు లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అధికారులు జోక్యం చేసుకున్నప్పటికీ ఇక్కడ సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. మరోవైపు గత నెలలోనే ఒక పాఠశాలలో విద్యార్థులపై కుల వివక్ష చూపించారంటూ విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. ఈ సమస్యను పరిష్కరించకపోగా ప్రతిపక్ష వైసిపి విద్యార్థులతో కుల రాజకీయం చేస్తోందంటూ ఉపముఖ్యమంత్రి స్థాయి నేత విమర్శించటం చిత్తశుద్ధి లేమికి దర్పణం పడుతోంది. ఉమ్మడి జిల్లాలోనే పిఠాపురం నియోజకవర్గం ఓ రోల్ మోడల్ కాబోతోందంటూ ఆశించిన అక్కడి ప్రజలకు గడచిన 18 నెలల్లో ఎటువంటి భరోసా లభంచలేదు. అభివృద్ధి జాడే లేదు. మరోవైపు ఎంఎల్ఎలూ అందుబాటులో లేరు. మాజీ ఎంఎల్ఏ వర్మపైనా జనసేన నేతలు సోషల్ మీడియా వేదికగా విమర్శనాస్త్రాలతో ఇప్పటికీ ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. మొత్తం మీద ఆ నియోజకవర్గం చుక్కాని లేని నావలా తయారయిందనడంలో ఎటువంటి సందేహమూ లేదని సుస్పష్టమవుతోంది.

స్వచ్ఛ ఆంధ్ర కోసం కృషి

స్వచ్ఛ ఆంధ్ర కోసం కృషి చేస్తామంటూ శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రతిజ్ఞా కార్యక్రమాలు జరిగాయి. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పలు చోట్ల ముస్తాబు కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ముస్తాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, భీమేశ్వరాలయం ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ కంటే బాబు, పట్టణ టిడిపి అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, సిఐ ఎ.కృష్ణభగవాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పనసపాడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీకట్ల వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి ఎన్.ముసలయ్య, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముస్తాబు కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపల్ సిహెచ్.లీలాశ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఐ.శారద పాల్గొని మాట్లాడారు. **జగ్గంపేట** స్థానికంగా జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డిఎస్‌పి శ్రీహరిరాజు, సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, సిడిపిఒ ఎం.పూర్ణిమ, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఎస్ఐ రఘునాథరావు, తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ** స్థానిక ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యాలయ పరిసరాల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ జి.ప్రసాద్, ఇఇ ఎన్.ఉదయభాస్కర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.వెంకటసూర్యనారాయణ, డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్ రెడ్డి, కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ వి.కేశవరావు ఆధ్వర్యంలో ముస్తాబు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సామర్లకోటలో పాల్గొన్న ఎంఎల్ఏ చినరాజప్ప

ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని నీటి వనరులకు సంబంధించి పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ పరిధిలోని కాలువలు, చెరువులు, డ్రయిన్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ట్రైనీ కలెక్టర్ మానీషాతో కలిసి వాచ్ డాగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నీటి వనరులను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా కాలువలు, చెరువులు, డ్రయిన్స్ లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు జిల్లాలోని వాటర్ బాడీస్‌పైన ఉన్న ఆక్రమణలను గుర్తించాలన్నారు. గుర్తించిన ఆక్రమణలను ప్రణాళిక ప్రకారం తొలగించేందుకు ప్రతినెల లక్ష్యం నిర్దేశించుకుని పని చేయాలన్నారు. ఇందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కాలువలు, చెరువులు, డ్రయినేజీలలో నీటి ప్రవాహానికి అడ్డు తగిలే తూటు, గుర్రపు డెక్కను ఇతర చెత్త తొలిగింపుకు పరిష్కార మార్గాలపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జె.వెంకటరావు, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, డిపిఒ వి.రవికుమార్, ఇరిగేషన్ ఎస్ఇ కె.గోపినాథ్, పిసిబి ఇఇ ఎం.శంకరరావు, ఇరిగేషన్ ఇఇ శేషగిరిరావు, డ్రయిన్స్ ఇఇ కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అపూర్వభరత్, అధికారులు



విన్నర్ జట్టుతో కళాశాల యాజమాన్యం

చిల్డ్రన్స్ కప్ సాధించిన శ్రీప్రకాష్ జట్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈస్ట్ గోదావరి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో మూడు రోజులపాటు జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ చిల్డ్రన్స్ కప్ పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ జట్టు విన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం జట్టు సభ్యులను పాఠశాల డైరెక్టర్ సిహెచ్.విజయ్‌ప్రకాష్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి 8 జట్లు పాల్గొన్న టోర్నమెంటులో తమ విద్యార్థులు విన్నర్‌గా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన క్రికెట్ కోచ్ దుర్గాప్రసాద్, విద్యార్థులను ప్రిన్సిపల్ ఎస్.మూర్తి, అకడమిక్ కో-ఆర్డినేటర్ ప్రశాంతి, కల్చరల్ కో-ఆర్డినేటర్ ఉషాచైతన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక సాలిపేట కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శనివారం ఘనంగా ముగిసింది. డిఇఒ పి.రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎంఎల్ఏ వనమాడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్రంలోనే మన జిల్లా విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉండాలని, అందుకు అవసరమైన సహకారం అందిస్తానని అన్నారు. డిఇఒ రమేష్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులను సైన్స్ పట్ల ఆకర్షితులయ్యేలా బోధిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్ జిల్లా సైన్స్ రిపోర్ట్‌ను అందించారు. డివైఇఒ కెవివి.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు అంతా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని పిలుపు నిచ్చారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ చిట్టి బుర్రలు భవిష్యత్ ఆవిష్కరణలకు నెలవులు అని కితాబునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ సత్యనారాయణ, అర్బన్ ఎంఇఒ రవి, జిల్లాలో వివిధ పాఠశాలలకు సంబంధించిన అధ్యాపకులు, సైన్స్ టీచర్స్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఎల్‌సి పద్మశ్రీ

బాల్యవివాహ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - పిఠాపురం, పెద్దాపురం

పిఠాపురం కోర్ట్ కాంప్లెక్స్‌లో బాల్య వివాహాల అనర్థాలపై ఐసిడిఎస్, ప్యానెల్ లీగల్ న్యాయవాదులు, వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి మాట్లాడారు. సంబంధిత శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ సిహెచ్ఎస్‌కె.దుర్గాదేవి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. పెద్దాపురం మహారాణి కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, ప్యానల్ లీగల్ అడ్వకేట్ సకురు దుర్గారావు పాల్గొని మాట్లాడారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి, ఎన్.అప్పలకొండ, కెవి.లక్ష్మి, క్రాప్ స్వచ్ఛంద సంస్థ సోషల్ వర్కర్ బి.లక్ష్మి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయవాదులు, వాలంటీర్లు

జనసేవాదళ్ కవాతుకు తరలి రండి

ప్రజాశక్తి - కాకినాడ

వచ్చే ఏడాది జనవరి 18న ఖమ్మంలో జరుగుతున్న జనసేవదళ్ కవాతుకు తరలిరావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.మధు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పొన్నామండ రామచంద్రరావు పిఆర్ భవన్లో చలో ఖమ్మం కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 20 నుంచి 26 వరకు వాడవాడల సిపిఐ జెండావిష్కరణలు ప్రదర్శనలు ఉత్సవాలు జరపాలని ఆయన కోరారు. ఈనెల 27న సామర్లకోటలో జిల్లా మహాసభ జరగనుందని, ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, జిల్లా కార్యవర్గ సభ్యులు శాఖ రామకృష్ణ, పప్పు ఆదినారాయణ, బొబ్బిలి శ్రీనివాస్, ఆనందరావు, కిషోర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు



కార్డులను అందిస్తున్న నాయకులు

రైతన్నల శ్రేయస్సే లక్ష్యం

ప్రజాశక్తి - తాళ్లరేవు

రైతన్నల శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టిడిపి మండల అధ్యక్షుడు ధూళిపూడి బాబి అన్నారు. శనివారం మండలంలోని పి.మల్లవరం ఆర్ఎస్‌కెలో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావలసిన అన్ని రకాల ఎరువులు ప్రతి సొసైటీలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు విళ్ల వీరా, ఎఎంసి డైరెక్టర్ పెచ్చెట్టి శ్రీలక్ష్మి, నాయకులు విళ్ళ సత్యనారాయణ, ధూళిపూడి సుబ్రహ్మణ్యం, దడాల సత్తికొండ, ధూళిపూడి గోపి, పితాని వీరబాబు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు

49 మంది హోంగార్డులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పోలీసుశాఖలో పనిచేస్తున్న 49 మంది హోంగార్డులకుఉద్యోగోన్నతి కల్పిస్తూ పోలీస్ స్పెషల్ ఆఫీసర్ ఆర్.ఎలుమలై ఉత్తర్వులు జారీచేశారు. వీరి విద్యార్హత ధ్రువపత్రాలను ఈ నెల 23న పరిశీలించనున్నట్లు తెలిపారు. యానాం నుంచి దువ్వారపు వి.జానకిరామయ్య, మెల్లం గిరిష్ సుధాకరరావు, కుక్కల దుర్గాప్రసాద్ ఉద్యోగోన్నతి పొందారు.

నేడు పల్స్‌పోలియో కార్యక్రమం

ప్రజాశక్తి - యానాం

యానాంలో నేడు పల్స్‌పోలియో కార్యాక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేసినట్లు వైద్యశాఖ అధికారి టి.రవిశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పకుండా రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలున్న పోలియో చుక్కలు పిల్లలకు వేయించవచ్చన్నారు.



ముగింపు కార్యక్రమంలో అతిథులతో ఫ్యాకల్టీలు

ముగిసిన 5 రోజుల వర్క్ షాప్

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఫోరెన్సిక్ విభాగంలో నిర్వహించిన ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆదిత్య విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ పి.రవికుమార్ నిరంతర ఫ్యాకల్టీ అభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. 'థర్డ్ ఐ టెక్నో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషకుడు బి.నవీన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేట్ డీన్ విలాస్ అనిల్‌చవాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పివి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వల్లభునికి రూ.2.19 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.2.19 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,40,560, అన్నదాన విరాళాల ద్వారా రూ.58,652, కేశఖండన ద్వారా రూ.3080, తులాభారం ద్వారా రూ.100, లడ్డు ప్రసాదం ద్వారా రూ.16,860 వెరసి రూ.2,19,252 ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ మొయిళ్ల సంధ్య, పంచాయతీ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆలయ సిబ్బంది, సేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యలు పరిష్కరించాలని నెల్లూరులో శాంతియుతంగా పోరాటం చేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులపై పోలీసులు లాఠీఛార్జీని ఖండిస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరితే లాఠీచార్జీ చేయించడం అన్యాయం అన్నారు. కార్మికులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వర్రే గిరిబాబు, శివకోటి అప్పారావు, నాయకులు ముత్యాల శ్రీను, నాగేశ్వరరావు, నరేష్ కుమార్, బెల్లంకొండ శివ, ం పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు